చలివేంద్రం ప్రారంభం

పటాన్‌చెరు: శ్రీ భగవాన్ సత్యసాయిబాబా సేవాసమితి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. వేసవి సందర్భంగా ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు పటాన్‌చెరులోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సత్యసాయిబాబా చలివేంద్రాన్ని సోమవారం ఉదయం ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవికాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనాయమన్నారు. అనంతరం బాబా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్ : ఆస్తి పన్ను చెల్లింపునకు ఎర్లీబర్డ్ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ 2025–2026 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను మొత్తాన్ని ఏక కాలంలో ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా చెల్లించి 5 శాతం రాయితీని పొందాలన్నారు. ఈ నెల 30 వరకు ఇందుకోసం గడువు ఉన్నందున అడ్వాన్స్‌గా పన్ను చెల్లించుకోవచ్చన్నారు. గృహ, వాణిజ్య, భవన యజమానులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభిషేకం.. అలంకరణ

చందానగర్ : మియాపూర్ డివిజన్ పరిధి మయూరినగర్‌లో శ్రీ ధ్యాన మారుతి మందిరంలో సోమవారం ప్రాతఃకాలంలో స్వామి వారికి అభిషేకంతో పాటు విశేష అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయ అర్చకులు గంతల భృంగీశ్వర్ ప్రవచనాలు బోధించారు. ఉగాది నూతన సంవత్సర పంచాంగ పఠనం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీగా సమ్మయ్య

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ సర్కిల్–18 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌గా సమ్మయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు ఆయన బేగంపేట సర్కిల్–30 డీసీగా వ్యవహరిస్తున్నారు. సర్కిల్–18 డీసీగా ఉన్న ప్రశాంతిని శేరిలింగంపల్లి సర్కిల్–20 డీసీగా బదిలీ చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ డీసీగా ఉన్న ముకుందరెడ్డి ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ప్రశాంతిని నియమించారు. ప్రశాంతి స్థానంలో జూబ్లీహిల్స్ సర్కిల్‌కు సమ్మయ్యను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆస్తిపన్ను కట్టలేదని.. దుకాణం ముందు గుంత తవ్వారు



చందానగర్ : ఆస్తిపన్ను బకాయిలు కట్టలేదని వాప్యారం సముదాయం ముందు జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ 21 అధికారులు జేసీబీతో గుంత తవ్వారు. దీంతో వెంటనే సముదాయం యజమాని సోమవారం బకాయి ఉన్న రూ.30 లక్షలకు గాను రూ.15 లక్షలు చెల్లించి మరో రూ.15 లక్షలు రాయితీ పొందాడని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలలోకి వెళితే.. బకాయిదారులు 2018 సంవత్సరం నుంచి ఆస్తి పన్ను చెల్లించడం లేదని పలుమార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఆదివారం గుంత తవ్వారు. దీంతో అతను కార్యాలయంకు వచ్చి రూ.15లక్షలు ఆస్తి పన్ను బకాయి చెల్లించాడు.

మద్యం మత్తు.. అతి వేగం.. ముగ్గురికి రిమాండ్

ఫిలింనగర్: రెండు రోజుల క్రితం అర్ధరాత్రి మద్యం మత్తులో అతి వేగంతో కారు నడుపుతూ ప్రమాదానికి కారకులైన ముగ్గురు యువకులను ఫిలింనగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా.. శనివారం తెల్లవారుజామున బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌కు చెందిన బి.రాజ్‌కిరణ్, మల్లికార్జున్(21), స్నేహిత్(24) ముగ్గురూ కలిసి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–92లోని మాజీ మంత్రి జానారెడ్డి ఇంటి ముందు నుంచి ఫిలింనగర్ వైపు మద్యం మత్తులో మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్నారు. క్యాబ్ డ్రైవర్ రాజ్‌కిరణ్ కారు నడిపిస్తూ పక్కన కూర్చున్న మల్లికార్జున్‌కు డ్రైవింగ్ నేర్పిస్తున్నాడు. ముగ్గురూ మద్యం మత్తులో అతి వేగంతో దూసుకెళ్తుండగా కారు అదుపుతప్పింది. ఎదురుగా ఉన్న రెండు బైక్‌లను ఢీకొట్టడంతో అవి పూర్తిగా దెబ్బతినడంతో పాటు కారు ఓ షోరూంలోకి దూసుకెళ్లింది. కారులోని ముగ్గురు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫిలింనగర్ పోలీసులు కారు నడిపిస్తున్న రాజ్‌కిరణ్‌కు డ్రంకన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా 94 బీఏసీగా నమోదైంది. మిగతా ఇద్దరు కూడా మద్యం తాగినట్లు పరీక్షల్లో బయటపడింది. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శుభాకాంక్షలు చెబుతున్న ట్రాఫిక్ పోలీసు


ఆదిత్యనగర్ ఈద్గాలో ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు

భక్తిశ్రద్ధలతో రంజాన్

ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు



చందానగర్/మాదాపూర్: రంజాన్ పండగను సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. శేరిలింగంపల్లిలోని ప్రేమ్‌నగర్, ఆదిత్యనగర్ ఈద్గా, మాదాపూర్ ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మత గురువులు రంజాన్ పర్వదినం ప్రాముఖ్యత, ఇఫ్తార్, రోజా పవిత్రత గురించి వివరించారు. ఆయా ఈద్గాల వద్ద పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్‌గౌడ్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈద్గాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఈద్గాల చుట్టూ ప్రహరీ నిర్మిస్తాం
ఎమ్మెల్యే గాంధీ హామీ

శేరిలింగంపల్లిలో ఉన్న ఈద్గాలకు దశలవారీగా ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.


మాదాపూర్ ఈద్గా వద్ద..


ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే గాంధీతో సెల్ఫీ తీసుకుంటున్న దృశ్యం

కొనసాగుతున్న ఉగాది వసంతోత్సవాలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఉగాది వసంతోత్సవాల్లో భాగంగా సోమవారం నాట్యగురువు శీనయ్య శిష్యబృందం కూచిపూడి ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో బ్రహ్మాంజలి, ప్రణమామ్యహం, జతిస్వరం, దశావతార శబ్దం, జనుతశబ్దం, గణపతికౌతం, హిందోళం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు భవిష్య, హృతిక, వర్షిత, హంసిని, సిద్ధి, మేఘన, శాన్వి, ఈషా కృష్ణ, సాన్విక, గౌరి, రుషిక, అందీవరా, సమీనా, ధృవి, జాన్వి, రిత్వి, దీప్సిక తదితరులు పాల్గొన్నారు.



సన్న బియ్యం పంపిణీకి బ్రేక్


బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్ రేషన్ షాపులో సన్నబియ్యం బస్తాలు

బంజారాహిల్స్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈనెల 1వ తేదీ నుంచి ఇవ్వాల్సిన సన్నబియ్యం పంపిణీకి బ్రేక్ పడింది. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలోని 81 రేషన్ షాపుల పరిధిలో రూ.2,95,779 మంది కార్డుదారులకు తీవ్ర నిరాశే మిగిలింది. ఉగాది కానుకగా వీరందరికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే కోడ్ నేపథ్యంలో సన్నబియ్యం పంపిణీ చేపట్టవద్దని ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో సర్కిల్–7 పరిధిలో ఏప్రిల్ నెల కోటా కింద దొడ్డు బియ్యాన్ని పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించారు. సన్న బియ్యం బస్తాలు పక్కనుంచాలని కూడా ఆదేశించారు. అన్ని రేషన్ షాపులు దొడ్డు బియ్యం పంపిణీ చేయనున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఏప్రిల్ 29 వరకు అమలులో ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ నెల కోటా కింద సన్న బియ్యం ఇవ్వడం లేదని, మే నెల నుంచి పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

మల్లన్న జాతర

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఇమామ్ నగర్ గ్రామంలో సోమవారం మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో భాగంగా స్వామివారి అగ్ని గుండాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మల్లన్న స్వామి దయతో గ్రామాలు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజేష్, ఆంజనేయులు, శివరాజ్, ప్రభాకర్ రెడ్డి, శాంతవర్మ రెడ్డి, కృష్ణ గౌడ్, రామకృష్ణ, పరమేష్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన రంగనాథుడి ఉత్సవాలు


రంగనాథస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి


గోపన్‌పల్లిలో రంగనాథస్వామి ఊరేగింపు

రాయదుర్గం: రంగనాథస్వామి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఆలయంలో పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం ఆలయం చెరువులో అవభృతస్నానం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అర్చకులు పంచాంగ పఠనం నిర్వహించారు. ఆలయంలో శతాబ్దాలుగా ఉగాది తరువాతి రోజు పంచాంగ పఠనం చేయడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు రవీంద్రప్రసాద్ దూబే, సభ్యులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు.

తత్వమసి –25 కేలండర్ ఆవిష్కరణ

చందానగర్ : శ్రీ తత్వమసి– 2025 నూతన సంవత్సర కేలండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. చందానగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు సుదర్శన సత్యసాయి, దేవాలయ చైర్మన్ రఘుపతిరెడ్డి, ప్రసాదరావు గురుస్వామి, ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ఉగాది రోజు కొత్త సంవత్సరం మొదలవుతుందన్నారు. తరువాత తరానికి తెలుగు నెలల పేర్లు, వారాలు, తిథులు తెలియజేయడానికి కాలసూచిని ప్రచురించామన్నారు.



కార్యక్రమంలో కార్యదర్శి బి.సుభాష్, రాంగోపాల్, వెంకట శేషయ్య, బ్రహ్మయ్య గుప్త తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడలోని లక్ష్మీ నర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఏప్రిల్ 4 నుంచి 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 4న ఉదయం స్వస్తి వాచనం, స్వామి వారికి నివేదన, సాయంత్రం అంకురార్పణ, పుట్ట మన్నుతెచ్చుట, లఘు హోమం, స్వామి వారికి నివేదన, తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 5వ తేదీ ఉదయం ధ్వజారోహణం, నిత్య హోమం, స్వామి వారికి అభిషేకం, సాయంత్రం నిత్య హోమం, మండపారాధన, స్వామి వారికి నివేదన, తీర్థప్రసాద గోష్టి నిర్వహిస్తామని వివరించారు. 6వ తేదీన ఉదయం పూర్ణాహుతి, శ్రీ సీతారామ చంద్రులకు అభిషేకం, అనంతరం సీతారాముల కల్యాణం, అన్నదానం, సాయంత్రం శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి వారి కల్యాణం, శివపార్వతుల కల్యాణం, వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వేదపండితులు, అర్చకులు చలమాచారి బృందం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ఆకట్టుకున్న బాలనాగమ్మ నాటకం

ఫిలింనగర్: ఫిలినగర్‌లోని ఫిలింఛాంబర్ రామానాయుడు కళామండపంలో ఉగాది నాటకోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పాతూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే నాటకోత్సవాల్లో సోమవారం ఉయ్యూరుకు చెందిన శ్రీదేవి కళా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన బాలనాగమ్మ జానపద నాటకం అలరించింది. బాలనాగమ్మగా వీరమణి, కార్యవర్ధిగా సోమర ఎర్రస్వామి చౌదరి, ఫకీర్‌గా జెట్టి సాంబశివరావు, పులిరాజుగా ముత్యాల నాగేశ్వర్‌రావు, సంగుగా ఇంద్రజ, తిప్పడుగా ఈగ నాగేశ్వర్‌రావు, లచ్చిగా మనుప్రియ, జంగమ దేవరగా రాధాకృష్ణ నటించారు. రంగస్థల కళాకారులను ప్రోత్సహించడంతో పాటు నేటితరం యువతకు, సినీ ప్రేమికులకు రంగస్థల నాటికలను పరిచయం చేసే ప్రయత్నమే ఈ కార్యక్రమం అని సుబ్బారావు తెలిపారు. ఫినిక్స్ ఫౌండేషన్ చైర్మన్ చుక్కపల్లి సురేష్, చుక్కపల్లి అవినాష్, సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, చార్టెడ్ అకౌంటెంట్ దేవనాథ్ సూరి తదితరులు పాల్గొన్నారు.



అర్ధరాత్రి అరగంట..!

- పర్వత్‌నగర్ ప్రభుత్వ హాస్పిటల్ లైన్‌లో సమయపాలన లేకుండా మంచినీటి సరఫరా
- అదికూడా లోప్రెషర్‌తో.. ఇబ్బందుల్లో స్థానికులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ ప్రభుత్వ హాస్పిటల్ లైన్‌లో నీటి సరఫరా సక్రమంగా కాకపోవడంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయపాలన లేకుండా రాత్రివేళల్లో 10 నుంచి 12 గంటల ప్రాంతంలో అది కూడా లోప్రెషర్‌తో సరఫరా చేస్తున్నారు. హైప్రెషర్‌తో పాటు నీటి సరఫరా సమయం పెంచాలని ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. సాధారణంగా గంటపాటు సరఫరా అయ్యే తాగు నీరు అరగంట మాత్రమే వదులుతున్నారు. అంతేగాకుండా కలుషితమైన నీరు సరఫరా కావడంతో శుద్ధజలం మురుగునీరుగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమయపాలన లేకుండా నీటి సరఫరా..

సమయపాలన లేకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నారని వాపోతున్నారు. దీంతో అటు పనికి వెళ్లలేక, ఇటు నీటిని పట్టుకోలేక, రాత్రి వేళల్లో జాగరణ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్దిష్ట సమయంలో సక్రమంగా నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి. కలుషిత నీరు రాకుండా శాశ్వత చర్యలు చేపటాలని ప్రజలు కోరుతున్నారు.





అండర్‌పాస్‌లపై ఆకట్టుకునే చిత్రాలు

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా ..

మాదాపూర్: మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ఉన్న అండర్‌పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జిల గోడలు, పిల్లర్లపై కళాకారులు అందమైన చిత్రాలను వేసి ఆకట్టుకుంటున్నారు. నగర సుందరీకరణలో భాగంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే విధంగా బతుకమ్మ, పోతురాజులు, పేరిణీ నాట్యం చిత్రాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలిపే విధంగా పిల్లర్లపై వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సమాజ సేవకుల చిత్రాలను వేశారు. జేఎన్ఎఫ్‌యూ విద్యార్థులు అయ్యప్పసొసైటీకి వెళ్లే అండర్ పాస్ బ్రిడ్జి గోడలపై నగరంలోని ప్రధాన కూడళ్లు, మార్కెట్‌ల గురించి పెయింటింగ్‌లు వేశారు. మొజంజాహీ మార్కెట్, కోఠి, సుల్తాన్‌బజార్ ఇలా 16 ప్రముఖ మార్కెట్‌ల చిత్రాలను వేశారు.

